ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 71 | గురువారం 13, నవంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# మోడీనే టార్గెట్!



ఢిల్లీ కారు పేలుడు కేసు దర్యాప్తులో బయటపడుతున్న సంచలనాలు
ఉగ్రకుట్ర వెనుక ఐదుగురు ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు
జనవరి 26న ఎర్రకోట వద్ద పేలుళ్లకు భారీ స్కెచ్
ప్రధాని మోదీ ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు
అరెస్టయిన డాక్టర్ ఫోన్ డేటాతో బట్టబయలైన కుట్ర
ఎర్రకోట వద్ద నిందితులు పలుమార్లు రెక్కీ చేసినట్లు గుర్తింపు

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు విచారణను వేగవంతం చేయగా, దీని వెనుక ఉన్న భారీ ఉగ్రకుట్ర వివరాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గణతంత్ర దినోత్సవం రోజున మిగతా 2లో



## ఇదేనా బంగారు తెలంగాణ?..

### రెండు ప్రభుత్వాల పాలనలో మార్పు లేదు

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తేడా లేదన్న కవిత
నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు లేవని విమర్శ
20 శాతం తేమ ఉన్న పత్తిని కొనాలని డిమాండ్
నల్గొండలో తన ఫ్లెక్సీల తొలగింపుపై తీవ్ర ఆగ్రహం
జాగృతి నేతలతో పెట్టుకోవద్దని ప్రత్యర్థులకు హెచ్చరిక

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రాష్ట్రంలోని సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. రెండు ప్రభుత్వాల హయాంలోనూ ప్రజల కష్టాలు తీరలేదని, ఇదేనా బంగారు తెలంగాణ అని ఆమె ప్రశ్నించారు. బుధవారం నల్గొండలో పర్యటించిన ఆమె, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లాకు గత 12 ఏళ్లుగా కృష్ణా జలాలు పూర్తి స్థాయిలో అందాయో లేదో ఆలోచించుకోవాలని కవిత అన్నారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోతే కాంట్రాక్టర్‌ను ఒక్క మాట కూడా అనలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రాజెక్టుల వద్దకు తాము వెళ్తే నిర్వాసితులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో కనీస వసతులు లేవని, ఐసీయూలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను మిగతా 2లో




# తప్పెక్కడ జరిగింది?

వారం రోజుల ముందు వరకు బీఆర్ఎస్ వైపు ఆధిక్యత
జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్‌దేనని ఎగ్జిట్ పోల్స్ ప్రిడిక్షన్
షాక్‌కు గురవుతున్న గులాబీ పార్టీ నేతలు, కార్యకర్తలు
కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన అంశాలేమిటి?
తమను దెబ్బ తీసిన విషయాలు ఏమిటని జోరుగా చర్చ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ వర్గాల్లో టెన్షన్ పెట్టిస్తోంది. పోలింగ్‌కు వారం రోజుల ముందు వరకు బీఆర్ఎస్ వైపు ఆధిక్యతను చూపిన సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ వచ్చే సరికి కాంగ్రెస్ వైపు ప్రిడిక్షన్ ఇచ్చాయి. జూబ్లీహిల్స్ సీటు కాంగ్రెస్‌దేనని ఇక్కడ 68 శాతం ఓట్ల ఆధిక్యంతో హస్తం పార్టీ విజయకేతనం ఎగరవేయబోతోందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో బీఆర్ఎస్ శ్రేణులు షాక్‌కు గురవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్నా భవిష్యత్‌లో తమ పార్టీకు పునర్ వైభవం రావాలన్నా జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం అనివార్యం అని భావించిన కారు పార్టీకి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు కలవరపాటుకు గురి చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో అసలు తప్పెక్కడ జరిగిది? కాంగ్రెస్‌కు కలిసి వచ్చిన అంశాలేమిటి? తమను దెబ్బ తీసిన విషయాలు ఏమిటనే చర్చ తెలంగాణ భవన్ వర్గాల్లో జోరుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**గేమ్ చేంజర్‌గా సీఎం రేవంత్ రెడ్డి**

మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఏర్పడిన ఉప ఎన్నిక కోసం అందరికంటే ముందే అభ్యర్థిని ప్రకటించి, గల్లీగల్లీకి తిరిగినా బీఆర్ఎస్‌కు ఆరంభంలో అంతా సానుకూ వాతావరణమే కనిపించింది. గెలుపు పక్క మెజార్టీపైనే లెక్క అన్నట్లుగా కొన్ని సర్వే సంస్థలు ప్రీపోల్ ఒపీనియన్స్ లో గులాబీ పార్టీ మెజార్టీపై అంచనాలు వేశాయి. కానీ ఎగ్జిట్ పోల్స్ వచ్చే సరికి ఆ వాతావరణం మిగతా 3లో



## నాగార్జున ఫ్యామిలీకి మంత్రి సురేఖ సారీ

నాగార్జున ఫ్యామిలీకి క్షమాపణ చెప్పిన మంత్రి కొండా సురేఖ
అర్ధరాత్రి ట్వీట్ చేసి పశ్చాత్తాపం వ్యక్తం చేసిన మంత్రి
గతంలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన
నాగచైతన్య, సమంత విడాకులపై చేసిన కామెంట్లతో రేగిన వివాదం
సురేఖపై పరువు నష్టం దావా వేసిన నాగార్జున

02



## వేములవాడ రాజన్న ఆలయం మూసివేత..

ఎల్ఈడీ స్క్రీన్లకే మొక్కులు.. భక్తుల ఆగ్రహం
అభివృద్ధి పనుల కారణంగా ఇనుప రేకులతో అడ్డు ఏర్పాటు
కార్తిక మాసంలో దర్శనం లేక భక్తుల తీవ్ర నిరాశ
ముందస్తు సమాచారం ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం

02



## అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?

ఢిల్లీ పేలుళ్లపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీజేపీ ఎంపీ రఘునందన్ ఆగ్రహం
బీజేపీకి సంబంధం ఉందంటూ పోస్టులు పెట్టడం దేశద్రోహమేనని వ్యాఖ్య
చేతిలో ఫోన్ ఉందని ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శ

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనను బీజేపీకి ఆపాదిస్తూ కొందరు సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దేశద్రోహం కిందికే వస్తుందని మిగతా 2లో



02

## కాళేశ్వరం కమిషన్‌పై విచారణ... జనవరికి వాయిదా

కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని పిటిషన్
పిటిషన్ దాఖలు చేసిన మాజీ సీఎస్ జోషి, స్మితా సబర్వాల్, కేసీఆర్, హరీశ్ రావు
ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు
ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు 3 వారాల సమయం

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

కాళేశ్వరం కమిషన్ విచారణను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ సీఎస్ ఎస్కే జోషి, ఐఏఎస్ స్మిత సబర్వాల్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మిగతా 2లో

## తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ
మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం
ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు
రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం




02

# వ్యభిచార ముఠా గుట్టురట్టు

చదువు పేరుతో వచ్చి దందా
మియాపూర్‌లో గుట్టుగా సాగుతున్న వ్యభిచార రాకెట్ బట్టబయలు
నిర్వాహకుడి సహా ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేసిన పోలీసులు
స్టూడెంట్ వీసాపై వచ్చి దందా నిర్వహిస్తున్న లైబేరియా జాతీయుడు
కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో వ్యభిచారం
నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించిన అధికారులు

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్ నగరంలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విదేశీయులు నిర్వహిస్తున్న ఓ వ్యభిచార ముఠాను పోలీసులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్ఓటీ, మియాపూర్ పోలీసులు సంయుక్తంగా జరిపిన ఈ దాడుల్లో నిర్వాహకుడి సహా మొత్తం మిగతా 2లో



# ఇదేనా బంగారు తెలంగాణ?..

**మొదటిపేజీ తరువాయి**

ఉంచి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. గర్భిణులకు ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్ మందు కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. భూదాన్ భూములను ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ కుడి కాలువ ఏపీ చేతుల్లో ఉంటే, ఎడమ కాలువను కేంద్రం చేతుల్లో పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో సామాజిక తెలంగాణ రావాల్సి ఉందని, దానికోసం జాగృతి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతులు పండించిన పత్తిలో 20 శాతం తేమ ఉన్నప్పటికీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అంతకుముందు, కవిత పర్యటనను పురస్కరించుకుని జాగృతి నాయకులు నల్గొండ పట్టణంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అయితే, మున్సిపల్ అధికారులు వాటిని రాత్రికి రాత్రే తొలగించడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"నాకు, మంత్రి కోమటిరెడ్డికి ఎలాంటి పంచాయతీ లేదు. అయినా నా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించారు?" అని ఆమె మండిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్ట్ చేసిన జాగృతి నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాను ప్రజా సమస్యలపై పోరాడేందుకే నల్గొండ వచ్చానని, రాజకీయాలు చేసేటప్పుడు బలమైన అభ్యర్థులనే బరిలో దింపుతామని అన్నారు. "జాగృతి నాయకులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదు" అని కవిత వ్యాఖ్యానించారు.





# వేములవాడ రాజన్న ఆలయం మూసివేత..

- **ఎల్ఈడీ స్క్రీన్లకే మొక్కులు.. భక్తుల ఆగ్రహం**
- **అభివృద్ధి పనుల కారణంగా ఇనుప రేకులతో అడ్డు ఏర్పాటు**
- **కార్తిక మాసంలో దర్శనం లేక భక్తుల తీవ్ర నిరాశ**
- **ముందస్తు సమాచారం ఇవ్వలేదని అధికారులపై ఆగ్రహం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు నిరాశ ఎదురైంది. కార్తిక మాసం కావడంతో స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులకు అధికారులు షాక్ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఈ తెల్లవారుజామున ప్రధాన ద్వారాన్ని ఇనుప రేకులతో పూర్తిగా మూసివేశారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో గత నెల రోజులుగా గుడి పరిసరాల్లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దక్షిణ, ఉత్తర ప్రాకారాలు, నైవేద్య శాల, ఈవో కార్యాలయాన్ని తొలగించారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రధాన ద్వారాన్ని కూడా మూసివేశారు. ప్రస్తుతం కేవలం అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి స్వామివారికి చతుష్కాల పూజలు నిర్వహిస్తున్నారు. అయితే, కార్తీక మాసం వంటి పవిత్రమైన సమయంలో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆలయాన్ని మూసివేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాదిగా తరలివచ్చిన వారు, స్వామివారిని దర్శించుకోలేక తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. చాలామంది భక్తులు ఆలయం ముందు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై కనిపిస్తున్న రాజన్నను చూసి, అక్కడి నుంచే మొక్కుకుని వెళ్లిపోతున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులు లేక వెలవెలబోతోంది.ప్రస్తుతం రాజన్న ఆలయానికి బదులుగా సమీపంలోని భీమేశ్వరాలయంలోనే దర్శన ఏర్పాట్లు చేశారు. కోడె మొక్కులు, ఇతర ఆర్జిత సేవలను కూడా అక్కడే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# వ్యభిచార ముఠా గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి**

ఐదుగురు విదేశీయులను అరెస్ట్ చేశారు.

మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ హఫీజ్‌పేట్‌లోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సోమవారం రాత్రి పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేపట్టగా, అక్కడ విదేశీ మహిళలతో వ్యభిచారం జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈ రాకెట్‌ను లైబేరియా దేశానికి చెందిన డేరియస్ (28) నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇతడు 2021లో స్టూడెంట్ వీసాపై భారత్‌కు వచ్చి, స్థానికంగా ఓ కళాశాలలో ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నాడు. కెన్యా, ఉగాండా దేశాలకు చెందిన మహిళలతో ఇతడు ఈ దందాను నడిపిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితుడు డేరియస్‌తో పాటు నలుగురు విదేశీ మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4 వేల నగదు, కొన్ని సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించగా, ప్రధాన నిందితుడైన డేరియస్‌ను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.





## కాళేశ్వరం కమిషన్‌పై విచారణ... జనవరికి వాయిదా

**మొదటిపేజీ తరువాయి**

మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జీఎం మోయినుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది.

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది. అదేవిధంగా ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయడానికి 4 వారాల గడువు ఇచ్చింది. ప్రభుత్వ కౌంటర్‌కు సమాధానం ఇచ్చేందుకు నలుగురు పిటిషనర్లకు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు కేసులో అంతకు ముందు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జనవరి రెండో వారానికి మధ్యంతర ఉత్తర్వులు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.

# అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?

**మొదటిపేజీ తరువాయి**

ఆయన హెచ్చరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించిన 'సర్దార్‌ఏక్తా పాదయాత్ర'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

"చేతిలో ఫోన్ ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే పేలుళ్లు జరుగుతాయని, దీని వెనుక బీజేపీ ఉందని నీచంగా మాట్లాడుతున్నారు. అసలు బాంబు పేలుళ్లకు, బీజేపీకి ఏం సంబంధం?" అని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్న వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ప్రజలు ఎవరూ ఇలాంటి వారిని సమర్థించవద్దని ఆయన కోరారు. ఢిల్లీలో బాంబులు పేల్చాలని ఒక వర్గం వారు కుట్ర పన్నారని, ఇప్పుడు ఆ నెపాన్ని బీజేపీపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన విషయంలో రాజకీయాలు చేయడం సరి కాదని హితవు పలికారు. ఉగ్రవాద చర్యలను ఖండించాల్సింది పోయి, ఒక రాజకీయ పార్టీపై బురద చల్లడం దారుణమని ఆయన అసహనం వ్యక్తం చేశారు.



# నాగార్జున ఫ్యామిలీకి మంత్రి సురేఖ సారీ

- **అర్ధరాత్రి ట్వీట్ చేసి పశ్చాత్తాపం వ్యక్తం చేసిన మంత్రి**
- **గతంలో చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటన**
- **నాగచైతన్య, సమంత విడాకులపై చేసిన కామెంట్లతో రేగిన వివాదం**
- **సురేఖపై పరువు నష్టం దావా వేసిన నాగార్జున**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబానికి క్షమాపణలు తెలిపారు. గతంలో తాను వారిపై చేసిన వ్యాఖ్యల పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ అర్ధరాత్రి ట్వీట్ చేశారు. నాగార్జున కుటుంబాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యల వల్ల వారు బాధపడి ఉంటే చింతిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నట్లు కొండా సురేఖ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..!**

కొంతకాలం క్రితం బీఆర్ఎస్ నేత కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో కొండా సురేఖ... అక్కినేని నాగార్జున కుటుంబంపై, ముఖ్యంగా నాగచైతన్య, సమంత విడాకుల అంశంపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. కొండా సురేఖ వ్యాఖ్యలపై నటుడు నాగార్జున తీవ్రంగా స్పందించారు. ఆమెపై పరువు నష్టం దావా కూడా వేశారు. మరోవైపు నాగచైతన్య, సమంత సైతం తమ విడాకులు పరస్పర అంగీకారంతో తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని, తమ పేర్లను అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు కూడా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే మంత్రి కొండా సురేఖ వెనక్కి తగ్గి క్షమాపణలు చెప్పినట్లు తెలుస్తోంది.





# తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా..

- **జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత భేటీ**
- **మరోసారి వాయిదా పడిన తెలంగాణ కేబినెట్ సమావేశం**
- **ఈరోజు జరగాల్సిన భేటీ ఈ నెల 15వ తేదీకి మార్పు**
- **రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం జరగనున్న సమావేశం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈరోజు జరగాల్సి ఉన్న ఈ భేటీని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. ఈ సమావేశానికి మంత్రులతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నారు. వాస్తవానికి ఈ కేబినెట్ సమావేశం తొలుత నవంబర్ 7వ తేదీన జరగాల్సి ఉండగా, దానిని 12వ తేదీకి మార్చారు. ఇప్పుడు తాజాగా మరోసారి వాయిదా వేసి 15వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన మరుసటి రోజే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే భేటీ తేదీని మార్చినట్లు సమాచారం.





# మోడీనే టార్గెట్!

**మొదటిపేజీ తరువాయి**

ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని లక్ష్యంగా చేసుకుని పేలుళ్లకు పథకం రచించినట్లు అధికారులు గుర్తించారు. ఈ కుట్రకు ఐదుగురు ఉన్నత విద్యావంతులైన డాక్టర్లు సూత్రధారులుగా ఉండటం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

విచారణలో భాగంగా ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్ ముజమ్మిల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పుల్వామాకు చెందిన ఇతడిని విచారించగా కీలక విషయాలు వెలుగుచూశాయి. అధికారులు అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డేటాను విశ్లేషించగా, అతడు మహమ్మద్ ఉమర్‌తో కలిసి పలుమార్లు ఎర్రకోట వద్ద రెక్కీ నిర్వహించినట్లు తేలింది. జనవరి 26న ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలో అక్కడ భారీ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌కు, ఢిల్లీ కారు పేలుడు ఘటనకు సంబంధం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. డాక్టర్ ముజమ్మిల్ ఫోన్ నుంచి లభించిన ఆధారాలతో ఈ కేసు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టారు. ఈ కుట్రలో ఇంకా ఎవరెవరు ఉన్నారు? వారి ప్రణాళికలు ఏమిటి? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. చదువుకున్న వైద్యులే ఉగ్రవాదం వైపు మళ్లడంపై భద్రతా ఏజెన్సీలు దృష్టి సారించాయి.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ హల్‌చల్.. పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు!

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. మంగళవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా హల్‌చల్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. పోలీసులు చెప్పినా వినకుండా యూసుఫ్‌గూడ వద్ద ఓ ఫంక్షన్‌హాల్లోకి అనుచరులతో ఆయన దూసుకెళ్లారని ఫిర్యాదు అందింది. ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారంటూ కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.





# మహిళా రక్షణ, డ్రగ్స్‌పై అవగాహన

**దౌల్తాబాద్, నవంబర్ 12 (ప్రజాస్వరం) :**
ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్ లో మహిళ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ శ్రీ మధు శ్రీవాత్సవ మరియు స్టూడెంట్ కౌన్సిలర్ బి. శివకుమార్ నిర్వహించారు. ప్రిన్సిపల్ మధు శ్రీవాత్సవ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మన చుట్టూ ఏదైనా తప్పు జరిగితే నిశ్శబ్దంగా ఉండకూడదు. వెంటనే పెద్దలకు చెప్పి, సమాజానికి సహాయం చేయాలి" అని సూచించారు. స్టూడెంట్ కౌన్సిలర్ శివకుమార్ మాట్లాడుతూ "మహిళల రక్షణ, లైంగిక వేధింపుల వంటి సమస్యలపై విద్యార్థులు వాలంటీర్లుగా పనిచేయాలి. సమాజంలో మార్పు తీసుకురావడంలో యువత ముందుండాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.సంపత్ కుమార్, ఎస్.దయానంద్, జె. భాగ్యమ్మ, కె.శ్రీనివాస్, బి.రమ్య తదితరులు పాల్గొన్నారు. ఇంటర్ విద్యా పరిషత్ డైరెక్టర్ అందించిన పోస్టర్లను కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు.




# లక్ష్యం ఉంటేనే విజయం సాధ్యం

- **ప్రధాన ఉపాధ్యాయుడు గోవర్ధన్**

**దౌల్తాబాద్, (ప్రజాస్వరం) :**
రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులలో ఉత్సాహం, ప్రేరణ నింపే కార్యక్రమం జరిగింది. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సుధాకర్ ఆధ్వర్యంలో దాత మాంకాల శ్రీనివాస్ 20 మంది పేద విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంలో ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. ఆ లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదవడం చాలా అవసరం. ఎవరి పరిస్థితులు ఎలా ఉన్నా సంకల్పం బలంగా ఉంటే విజయం సాధ్యమే," అని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రతిభలో ఎవరికి తీసిపోరని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు సహాయం చేసి ప్రోత్సహించిన దాత మాంకాల శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, మోహన్, వరప్రసాద్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# తప్పెక్కడ జరిగింది?

(మొదటి పేజీ తరువాయి)



పూర్తిగా తారుమారు అయింది. పోలింగ్ ముగిశాక ఇచ్చిన అంచనాల్లో మెజార్టీ సర్వే సంస్థలు కాంగ్రెస్ గెలవబోతున్నట్లు తేల్చాయి. ఈ పరిణామం బీఆర్ఎస్ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది. నిజానికి ఈ ఉప ఎన్నిక బీఆర్ఎస్, కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వైపు నుంచి కేటీఆర్, కాంగ్రెస్ వైపు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుక్షణం వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంపై బాకీ కార్డు, ఆరు గ్యారెంటీల విఫలం, నిరుద్యోగం, వంటి సమస్యలను తెరమీదకు తీసుకువస్తూ కాంగ్రెస్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేసింది బీఆర్ఎస్. కానీ ఆఖరి దశలో రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్డు షోలు, బైక్ ర్యాలీలతో పాటు క్షేత్రస్థాయికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంలో ఈ ఎన్నికలో గేమ్ చేంజర్ గా మారారనే టాక్ వినిపిస్తోంది. అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను అధిగమించడంలో, బీఆర్ఎస్ అవకాశాలను భారీగా దెబ్బతీయడంలో రేవంత్ రెడ్డి స్ట్రాటజీ వర్కౌట్ అయిందనే చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగా కేసీఆర్ ఫామ్‌హౌస్ కే పరిమితమై ఒక్కసారి కూడా జూబ్లీహిల్స్ వైపు చూడకపోగా రేవంత్ రెడ్డి మాత్రం వరుస ప్రచారంతో క్యాడర్ లో జోష్ నింపడంతో పాటు ఓటర్లను తమ వైపు మళ్లించుకోగలిగారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జూబ్లీహిల్స్‌లో జరిగింది పేరుకే ఉప ఎన్నిక అయినా ఇక్కడ ప్రధాన పార్టీల మధ్య సాధారణ ఎన్నికల కంటే హై రేంజ్ ఫైటింగ్ నడిచింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య నువ్వా నేనా అన్నట్లు డైలాగ్ వార్ సాగింది. ప్రచారం చివరి మూడు రోజులు భారీ హైడ్రామానే నడిచింది. స్టేట్ ఫ్యూచర్ పాలిటిక్స్ కు రూట్ మ్యాప్‌గా మారుతాయని భావిస్తున్న జూబ్లీహిల్స్ పోలింగ్ విషయంలోని సమీకరణాలు ఆసక్తిరేపుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ బలహీన పడి బీజేపీ బలపడితేనే అది కాంగ్రెస్ కు అనుకూలంగా మారే అవకాశం ఉందని చర్చ చాలా కాలంగా జరుగుతోంది. అలా కాకుండా బీజేపీ వీక్ అయి బీఆర్ఎస్ బలపడితే అది కాంగ్రెస్ కు నష్టం చేకూర్చుతుందనే టాక్ ఉంది. కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోని ఎగ్జిట్ పోల్స్ అంచనాలో మాత్రం బీజేపీ బలహీన పడినా కాంగ్రెస్ దూసుకుపోవడం ఖాయం అనే అంచనాలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఓట్ షేర్ చాలా వరకు బీఆర్ఎస్ కు టర్న్ అయిందని ఈ రెండు పార్టీల ఓట్ షేర్ పోగైనా ఇంకా కాంగ్రెస్ వైపే హెడ్జ్ ఉండటం ఆసక్తికర పరిణామం అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్ ఫలితాలే నవంబర్ 14న జరగబోయే కౌంటింగ్ రోజున రిపీట్ అవుతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంటే ఎగ్జిట్ పోల్స్ ఏమి ఎగ్జాట్ పోల్స్ కావని అంతిమ విజయం తమదేనని బీఆర్ఎస్ శ్రేణులు లెక్కలు వేసుకుంటున్నాయి. మొత్తం జూబ్లీహిల్స్ పోరులో వాస్తవంగా పైచేయి ఎవరిది అనేది తేలాలంటే రేపటి వరకు ఆగాల్సిందే.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేక రైతుల అవస్థలు



**దౌల్తాబాద్, నవంబర్ 12 (ప్రజాస్వరం) :**
మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలలు శ్రమించి పండించిన పంటకు సరైన ధర దక్కక రైతుల ఆవేదన వ్యక్తమవుతోంది. దుబ్బాక నియోజకవర్గం రైతులలో నూటికి 99 శాతం మంది వర్షాధార పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ నియోజకవర్గానికి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు (బీజేపీ) కాగా, దుబ్బాక ఎమ్మెల్యేగా బీఆర్ఎస్‌కు చెందిన కొత్త ప్రభాకర్‌రెడ్డి కొనసాగుతున్నారు. రాజకీయ నాయకులు తమ రాజకీయ జీవితాలను కొనసాగిస్తుండగా, రైతుల సమస్యలపై మాత్రం పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు తమ మొక్కజొన్నలను తొగుట, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు దళారులకు అమ్మకాలు జరపడంతో క్వింటాల్‌కు రూ.600 వరకు నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. కొనుగోలు గిడ్డంగులు, కేంద్రాల లేన్ని కారణంగా ప్రతి ఏడాది ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని రైతులు వాపోతున్నారు. "ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అవసరమైనచోట్ల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని" రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జీవనది..



పదిమంది కూడిన జాగల
పాటై పోటేత్తుతడు
సామాన్యుని పక్కన
అక్షర సైన్యమై
నిలబడుతడు
పాలకులు ఎవరైనా
పాటలతో
ప్రశ్నల తూటాలు సంధిస్తడు
కూటికి లేని బతుకుల గురించి
కోటి కోటి రాగాలు అల్లుతడు
ఉద్యమాలలో పాటకు పల్లవి అయితడు
ప్రకృతితో కరచలనం చేసి
మైమరచి గొంతేత్తుతడు
మాయమైపోతున్న మనిషి గురించి
కలత చెంది కవిత్వమల్లుతడు
దోపిడీ పీడనా సహించలేక
జన జాతరలో మన గొంతుక
వినిపిస్తాడు
ప్రశ్నించడమే ఆయుధంగా
పాటల సెలయేళ్లు పారిస్తడు
జయ జయహే తెలంగాణ
జననీ జయకేతనం అంటూ
కోటి గొంతుకలలో నాట్యం చేస్తడు
కొమ్మ చెక్కితే బొమ్మరా
కొలిచి మొక్కితే అమ్మరా అంటూ
ఆధ్యాత్మికతకు అర్థం చెబుతడు
అక్షరాల నిప్పు కణికలతో
పోరు రాజేస్తడు
ఆయన ఎక్కడికి వెళ్లి పోలేదు
గూడెం గుండెల మీద
పోరు గానం చేస్తున్నడు
సామాన్యుని పక్షాన
అక్షరమై వినిపిస్తున్నడు
కీచురాల చెప్పలలో
కోయిలమ్మల కూతలలో
పల్లె సింగారాలు ఆలపిస్తున్నడు
ఆయన పారేసెలయేరు
పాటల ఊటసెలిమే
అందేశ్రీ అమరుడు
చావు లేని జీవనది
నిత్య ప్రవహిణి

చెన్నరాజు
కవి, ఉపాధ్యాయుడు
9908010610
- దౌల్తాబాద్ , (ప్రజా స్వరం)

# బాధిత కుటుంబాలకు పద్మా దేవేందర్ పరామర్శ





**నిజాంపేట, (ప్రజా సర్వం) :**
మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన లాలాగౌడ్ విద్యుత్ షాక్ తో మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా జిల్లా అధ్యక్షురాలు యం. పద్మదేవేందర్ రెడ్డి, మండల నాయకులతో కలసి లాల గౌడ్ భార్యను కుటుంబ సభ్యులను పరామర్శించారు.లాలగౌడ్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మల్లేశం తండ్రి ఎర్ర. మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు.ఈ విషయం తెలుసుకున్న పద్మదేవేందర్ రెడ్డి బచ్చురాజు పల్లి చేరుకొని ఎర్ర. మల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వీరి వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, నిజాంపేట పిఎసిఎస్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్ గౌస్,నాయకులు యాదగిరి,వెంకటస్వామి గౌడ్ నరేందర్ నాయక్,సుభాష్ నాయక్, పత్తి నాయక్,రాజు,ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

# రోడ్ల కోసం రూ.175 కోట్లు మంజూరు చేయండి

## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి





**దౌల్తాబాద్ నవంబర్ 12 (ప్రజా స్వరం):**

దుబ్బాక నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి రూ.175 కోట్లు మంజూరు చేయాలని రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ (ఐఏఎస్) గారిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వికాస్ రాజ్ ని కలిసిన ఎమ్మెల్యే నియోజక వర్గంలో రోడ్ల దుస్థితిని వివరించి, తక్షణం నిధులు మంజూరు చేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అలాగే దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కె. శ్రీదేవి (ఐఏఎస్)ని కూడా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి కలిసి అభ్యర్థించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 కోట్లను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమని, ఆ నిధులను తిరిగి మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా, పంట నమోదు సమస్యలపై కూడా ఎమ్మెల్యే స్పందించారు. ఇటీవల కొత్తగా పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలు ఆన్లైన్‌లో నమోదు కాకపోవడంతో, వారు పంటను అమ్మలేక ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి (ఐఏఎస్) గారికి ఫోన్ ద్వారా వివరించారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



# రన్ ఫర్ యూనిటీ విజయవంతం చేయండి

**మెదక్ నవంబర్ 12 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14 న మెదక్ జిల్లా కేంద్రంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్ర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి రాందాస్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ పాదయాత్ర లో పాల్గొని, పాదయాత్ర ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, జనగామ ప్రబారి నందా రెడ్డి, జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏం ఎల్ ఎన్ రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



- **జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి**

**దుబ్బాక , నవంబర్ 12 (ప్రజాస్వరం) :**

విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు విద్యార్థులు ఎదగాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రోటరీ క్లబ్ ల్యాక్ జిల్లా మోహినబాద్, సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17 టీర్బర్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వారు పాఠశాల 44 మంది విద్యార్థినిలకు సైకిళ్లను అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు...పాఠశాల నుంచి ఇంటికి వెళ్ళగానే విద్యార్థులు సెల్ ఫోన్లు పక్కనపెట్టి చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సెల్ ఫోన్లకు ఆకర్షితులు కాకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని అన్నారు. సెల్ ఫోన్ల వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది అని అన్నారు.ఇష్టంతో చదివి మీ బంగారు భవిష్యత్తును సమాజానికి ఉపయోగపడే విద్యార్థుల భవిష్యత్తు ఎదగాలని అన్నారు.ఈనాటి విద్యార్థులే రేపటి భావితరాలకు బాటలు వెయ్యాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్య అధికారి అంజయ్య గౌడ్,తహసీల్దారు ఆశాజ్యోతి,పాఠశాల ఉపాధ్యాయులు, పీఎసీఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, తదితరులు పాల్గొన్నారు.



# వివాహిత అదృశ్యం

**జవహర్‌నగర్, నవంబర్ 12, ప్రజాస్వరం:**



వివాహిత అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కారం సిఆర్పిఎఫ్ క్వార్టర్స్ లో సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ బండి ప్రశాంత్ కుమార్ భార్య సౌజన్యతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 10వ తేదీన రాత్రి భార్యాభర్తలు ఇద్దరు భోజనాలు ముగించుకొని వారి నివాసంలో నిద్రపోయారు. 11వ తేదీ మంగళవారం ఉదయం భర్త ప్రశాంత్ కుమార్ లేచి చూడగా భార్య సౌజన్య(36) కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో బంధువులు స్నేహితుల వద్ద వెతికిన ఎలాంటి ఫలితం లభించకపోవడంతో బుధవారం జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



# చెత్తవేసే వారిపై ఫిర్యాదు

**రామాయంపేట, (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెరువు గ్రామ శివారులో కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాలు, చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్య దర్శి జ్యోత్స్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు గ్రామ శివారులో చెత్త వేస్తున్నారని, కుళ్లిన వ్యర్థాలు వేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులతో కలిసి ఆమె స్టేషన్లో ఫిర్యాదు చేశారు

# ప్రధాన రహదారి విస్తరణకు సర్వే

- **టీపీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు**

**రామాయంపేట. 12( ప్రజా సర్వం) :**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే రోహిత్ రావు కృషి చేస్తున్నారని టీపీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి అన్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి విస్తరణ కోసం సర్వే నిర్వహించారు. స్థానిక మెదక్ చౌరస్తా నుండి ఎస్సీ కాలనీ ఇందిరాగాంధీ విగ్రహం వరకు 45 ఫీట్ల రోడ్డు విస్తరణ చేయడం కోసం సర్వే నిర్వహించినట్లు వారు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారం కోసం రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే రోహిత్ రావు రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయించి రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణకు ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా సహకరించాలని సూచించారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి ప్రభుత్వం నుండి ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, చింతల స్వామి, అల్లాడి వెంకటి, చిలుక గంగాధర్, దేవుని నర్సింలు, వినయ్ సాగర్ పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**దౌల్తాబాద్, నవంబర్ 12(ప్రజాస్వరం) :**

ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వ సంస్థలలో బహిరంగ మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాయపోల్ ఎస్ఐ కుంచం మానస అన్నారు. మంగళవారం సాయంత్రం రాయపోల్ మండలం చిన్న మాసాన్ పల్లి గ్రామంలో పెట్రోలింగ్ చేపట్టాగ బహిరంగంగా మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ భద్రతా నియమాలలో భాగంగా ప్రతిరోజు రాత్రి సమయంలో మండలంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. దానిలో భాగంగానే చిన్నమాసాన్ పల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొంతమంది వ్యక్తులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. మద్యం సేవించిన వారిలో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన పండగ రాజయ్య, దయ్యాల కనకయ్య, అట్ల సంపత్, పండగ రవి, రాయపోల్ మండలం చిన్నమాసాన్ పల్లి గ్రామానికి చెందిన అరిగె సుదర్శన్ లుగా గుర్తించారు. ఈ అయిదుగురుపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ఎక్కడైనా ఎవరైనా ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రభుత్వ సంస్థలలో బహిరంగంగా మద్యం సేవించిన, పేకాట, జూదంలతో పాటు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెండు తీస్తాం

## రాయపోల్ ఎస్ఐ కుంచం మానస



**దౌల్తాబాద్, నవంబర్ 12( ప్రజాస్వరం) :**
గ్రామాలలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని రాయపోల్ ఎస్ఐ కుంచం మానస అన్నారు. రాయపోల్ మండలంలోని రాంసాగర్ గ్రామంలో మంగళవారం రాత్రి బెల్ట్ షాపుల పై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం విక్రయించిన, డ్రగ్స్, గంజాయి లాంటి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తూ సేవించిన ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నమ్మదగిన సమాచారం మేరకు రాంసాగర్ గ్రామంలో బెల్ట్ షాపుల పై దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన చెన్నగౌని శ్రీనివాస్ గౌడ్ బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడు. అతని షాప్ లో తనిఖీలు చేపట్టగా రూ.10 వేల విలువ గల 13 లీటర్ల మద్యం పట్టుకోవడం జరిగిందన్నారు. వెంటనే అట్టి మధ్యను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించడం జరిగిందన్నారు. చెన్నగౌని శ్రీనివాస్ గౌడ్ పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అలాగే మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకమీదట ఎవరు కూడా బెల్ట్ షాపు నిర్వహించి ప్రజల మధ్య గొడవలకు కారణమవ్వొద్దని హెచ్చరించారు.



# విద్యార్థుల ప్రతిభను వెలికితీసే క్విజ్ పోటీలు

- **రాయపోల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు**

**దౌల్తాబాద్, నవంబర్ 12( ప్రజా స్వరం) :**
విద్యార్థులలో దాగివున్న తెలివితేటలు నైపుణ్యాన్ని వెలికి తీయడానికి క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు అన్నారు బుధవారం రాయపోల్ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి సమితి సిద్దిపేట వారి ఆధ్వర్యంలో క్విజ్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు వివిధ రకాల పోటీలలో పాల్గొంటేనే విద్యార్థుల యొక్క ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. కాబట్టి విద్యార్థులు కూడా అన్ని పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగాలన్నారు. పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన సత్యసాయి సమితి సిద్దిపేట వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్విజ్ పోటీల నిర్వహణకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సులో మంటలు

## తప్పిన పెను ప్రమాదం



**నార్సింగి, నవంబర్ 12 (ప్రజా స్వరం) :**
పార్కింగ్ చేసి ఉన్న అక్షర టెక్నో స్కూల్ (రామాయంపేట) బస్సులో ఆకస్మికంగా మంటలు చెలరేగిన ఘటన మెదక్ జిల్లా నార్సింగి పట్టణ కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే బడి పిల్లలను విడిచి పెట్టిన అనంతరం బస్సు డ్రైవర్ బుధవారం సాయంత్రం కూడా బస్సును వేణు గోపాల స్వామి ఆలయం పక్కనున్న ఖాళీ స్థలంలో నిలిపి వెళ్ళిపోయాడు. సాయంత్రం దాదాపు 7 గం. ప్రాంతంలో బస్సులో నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన స్థానికులు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తూ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం తెలిపారు. స్థానిక ఎస్ఐ బీమరి సృజన వెంటనే రామాయంపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో బస్సు లోపలి భాగం, సీట్లు పూర్తిగా దగ్ధమయి భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. అదృష్టవ శాత్తు మంటలు డీజిల్ ట్యాంక్ కు అంటుకోకపోవడం తో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన పై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సృజన తెలిపారు. మంటలను ఆర్పడం లో లీడింగ్ ఫైర్ ఫైటర్ ప్రవీణ్ కుమార్, నవీన్ గౌడ్, బాబు, శంకర్ లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తవ్వకాలకు చెక్



**మెదక్, నవంబర్ 12 (ప్రజా స్వరం) :**
అక్రమ ఇసుక తవ్వకాలను సహించేది లేదని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లో అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని మెదక్ ఎస్పీ, డీఎస్పీ తో పాటు రెవెన్యూ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతలు అక్రమ ఇసుక తవ్వకాలు నిర్వహించారని, హరీష్ రావు కూడా మెదక్ నుండి పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ చేశారని ఆరోపించారు. మెదక్‌లో ఎటువంటి అక్రమ కార్యకలాపాలు ప్రోత్సహించమని ఆయన స్పష్టం చేశారు.

# ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**మెదక్, నవంబర్ 12 (ప్రజా స్వరం) :**
జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఈ నెల 14 న ప్రారంభం కానున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ చిలుమల సుహాసిని రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ప్రజా ప్రతినిధులు పాల్గొనన్నట్లు అన్నారు. నేషనల్ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి మెదక్ జిల్లా గ్రంథాలయంలో వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.



# వైభవంగా శివపార్వతుల కల్యాణం

**జగదేవపూర్, నవంబర్13,(ప్రజా స్వరం) :**
జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలో గల ప్రసిద్ధిపుణ్య క్షేత్రం శ్రీకొండపోచమ్మ ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలను గత మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ నిర్వాహకులు మాజీ సర్పంచ్ రజిత రమేష్, ఈఓ రవి కుమార్, ఆలయం చైర్మన్ అనుగీత,ఆలయం డైరెక్టర్లు సమక్షంలో కనులపండువగ నిర్వహించారు. చివరి రోజు అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం డైరెక్టర్లు దేవాలయం అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్ గెలుపు ఖాయం




- **టిపిసిసి చౌదరి సుప్రభాత రావు**

**రామయంపేట, ప్రజాసర్వం :**
మెదక్ జిల్లా రామయంపేట్ పట్టణం జూబ్లీ హిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపు ఖాయం అయినట్లు టిపిసిసి చౌదరి సుప్రభాత రావు. బుధవారంఆయన మీడియాతో మాట్లాడారు. గత10 ఏళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీకి జూబ్లీహిల్స్ ప్రజలు తగిన గుణపాఠం చెప్పక తప్పదు అన్నారు. అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తూ లక్షల కోట్లు దండుకొని ప్రజలను నట్టేట ముంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందని ఆరోపించారు. బడుగు, బలహీనవర్గాలకు ఆశ జ్యోతిగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వంలో అట్టడుగు వర్గాలకు ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీల అమలు అంచెలంచెలుగా నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. ఏదేమైనా అవినీతి బీఆర్ఎస్ పార్టీని అంతమందించడం కోసం జూబ్లీహిల్స్ ప్రజలకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
13.11.2025
గురువారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# 36 ఏళ్ల తరవాత శివ రీ రిలీజ్



**ఆర్జీవీ, నాగ్‌లతో సందీప్ వంగా చిట్‌చాట్**

నాగార్జున రామ్‌గోపాల్ వర్మకాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'శివ' 36 ఏళ్ల తర్వాతఈ నెల 14న రీ రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగ్, ఆర్జీవీలతో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్ నిర్వహించారు. 'శివ' 36 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయబోతోంది! ఫ్యాన్స్ కోసం ప్రత్యేకమైన సంబరాలు ప్లాన్ చేశారు. ఈ వీడియోలో మూడు జంటల మధ్య సరదా, క్రేజీ ముచ్చట్లు, వెనుకబడిన హిట్ మూవీ రహస్యాలు ఇలా ఫ్యాన్స్‌కి స్పెషల్ ఎమోషనల్ మినిట్స్ పంచుకోబోతున్నారు. ఇది కేవలం ఇంట్రెస్టింగ్ వీడియో మాత్రమే కాదు, నోస్టాల్జిక్ ట్రిప్ కూడా! సందీప్, నాగ్, ఆర్జీవీ మ్యూచువల్ బాండ్, సినిమా మేకింగ్ వెనుక ఉన్న స్టోరీస్, ఫన్ రియాక్షన్స్ చూపించడంతో వీడియో మరింత స్పెషల్ అయింది.





## ప్రొఫెషనల్ లైఫ్‌లోకి
# సమంత

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యాపార రంగంలో కూడా తనదైన ముద్ర వేస్తోంది. కొంతకాలం ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు మళ్లీ పూర్తి స్థాయిలో ప్రొఫెషనల్ లైఫ్‌లోకి తిరిగి వచ్చింది. వరుసగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ, నిర్మాతగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తోంది. తాజాగా సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' కింద 'మా ఇంటి బంగారం' అనే సినిమాను నిర్మిస్తోంది. ఈ సినిమా పూజా కార్యక్రమం ఇటీవలే ఘనంగా జరిగింది. ఇందులో సమంతతో పాటు దిగంత్, గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో నటించగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాను రాజ్ నిడుమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత నిర్మిస్తున్నారు. ఇక సినిమాలతో పాటు సమంత వ్యాపార రంగంలో కూడా వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే ఆమె క్లాతింగ్ బ్రాండ్‌ను విజయవంతంగా నడుపుతోంది. ఆ తర్వాత పెర్ఫ్యూమ్ బిజినెస్‌లో అడుగు పెట్టిన సామ్, ఇప్పుడు మరోసారి కొత్త వెంచర్‌ను ప్రారంభించింది. తాజాగా సమంత మరో కొత్త క్లాతింగ్ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ప్రమో వీడియోను షేర్ చేసింది. వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖులు సమంతకు శుభాకాంక్షలు తెలుపుతూ .. 'సామ్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా సక్సెస్ అవ్వాలి,ఎప్పుడూ యూనిక్‌గా ఉంటుంది' అంటూ కామెంట్లు చేస్తున్నారు. కొత్త వ్యాపార ప్రయాణం మొదలెట్టిన సమంత ఇప్పుడు

# ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి ఫ్రెంచ్ అవార్డు

భారత సినీ రంగానికి మరో గర్వకారణం. ప్రఖ్యాత ఆర్ట్ డైరెక్టర్ తోట తరణికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రదానం చేసే అత్యున్నత సత్కారం 'చెవాలియర్' కు ఆయనను ఎంపిక చేసింది. చెన్నైలోని ఫ్రెంచ్ కాన్సులేట్ కార్యాలయంలో గురువారం ఈ ప్రతిష్టాత్మక పురస్కారం ఆయనకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ తోట తరణికి అభినందనలు తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు, తమిళ, హిందీ సినిమాల్లో అద్భుతమైన సెట్ డిజైన్‌లతో మాయ చూపించారు. 'నాయకుడు', 'ఇంద్ర', 'దసరథి', 'జనతా గ్యారేజ్', 'తలపతి' వంటి సినిమాల్లో ఆయన సృష్టించిన సెట్లు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి తోట తరణి గారు, అని స్టాలిన్ పేర్కొన్నారు. ఇక ఆయనకు ఇప్పటికే మూడు నేషనల్ అవార్డులు, అనేక రాష్ట్ర అవార్డులు లభించాయి. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో 'చెవాలియర్' అవార్డు పొందడం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది. సినీ, కళా రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఈ గౌరవం అందజేస్తున్నట్లు ఫ్రెంచ్ అధికారులు తెలిపారు.



# బెడ్ సీన్స్ చేసేప్పుడు నలిగిపోక



**మళయాల బ్యూటీ దివ్య స్వీయానుభవం**

ఇప్పటి సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో రొమాన్స్‌కి బదులుగా లిప్‌లాక్‌లు, బెడ్‌సీన్స్ ఎక్కువవుతున్నాయి. ప్రేక్షకులు ఏమి కోరుకుంటే అదే చూపిస్తున్నామని మేకర్స్ అంటున్నారు. అయితే ఇవి నటించడం అంత ఈజీ కాదని నటి దివ్య పిల్కై స్పష్టం చేసింది. ఎయిర్‌లైన్స్ జాబ్ నుంచి సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఈ మలయాళ బ్యూటీ, తెలుగు ప్రేక్షకులకు 'తగ్గేదేలే' సినిమాలో హీరోయిన్‌గా గుర్తుంది. ఆ సినిమాలో లిప్‌లాక్ సీన్ చేసిన దివ్య, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ అనుభవం గురించి చెప్పింది. తాను మొదటగా మలయాళంలో 'కళాపురుష్' సినిమాలో టొవినో థామస్‌తో ఇంటిమేట్ సీన్ చేశా. ఫస్ట్ నో చెప్పా చుట్టూ కెమెరాలు, జనం ఉన్నప్పుడు అసౌకర్యంగా అనిపించింది. కానీ దర్శకుడు కట్ చెప్పే వరకు నటించాల్సిందే. ఆ సమయంలో ఏం చేసినా భరించాల్సిందే.. కెమెరా ఆన్ అయిన తర్వాత నటుడు, నటి ఇద్దరూ క్యారెక్టర్‌లో లీనం కావాలి. లిప్‌లాక్ లేదా బెడ్‌సీన్ చేస్తున్నప్పుడు మనకు ఇబ్బంది అనిపించినా, ఆ ఫీలింగ్ ఫేస్‌లో కనిపించకూడదు. సీన్ పూర్తయ్యేవరకు సహ నటుడు ఏం చేసినా కూల్‌గా ఉండాలి. ఎందుకంటే ప్రేక్షకుడు చూస్తే అది ఫేక్‌గా కాకుండా నేచురల్‌గా కనిపించాలని చెప్పుకొచ్చింది దివ్య. అలాగే, 'నేను గ్లామర్ రోల్స్ చేసినా, స్క్రిప్ట్‌కి తగ్గట్టు చేస్తాను. ఎప్పుడూ లిమిట్స్ దాటను. ప్రేక్షకులు నన్ను నటిగా మాత్రమే చూడాలని కోరుకుంటానని తెలిపింది. కాగా ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో.. కొందరు నెటిజన్లు ఆమె ప్రొఫెషనలిజాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఇలాంటి సీన్స్ అవసరమా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. దివ్య ప్రస్తుతం రెండు మలయాళ సినిమాలు, ఒక తెలుగు వెబ్‌సిరీస్‌లో నటిస్తోంది.

# నాని ప్యారడైజ్ కోసం భారీ సెట్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని దసరా డైరెక్టర్‌తో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన నాని లుక్‌తోపాటు మోహన్ బాబు పోస్టర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్ పోషిస్తోంది. సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో నాని తల్లిగా కనిపించనుంది. కాగా ది ప్యారడైజ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఇప్పుడొక ఆసక్తికర వార్త నాని అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంతకీ విషయమేంటంటే ది ప్యారడైజ్ కోసం హైదరాబాద్‌లో ఏకంగా రూ.7.5 కోట్లతో హౌస్ సెట్ వేస్తున్నారట. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను గుర్తుకుతెచ్చేలా ఉండబోతున్న ఈ ఇంటిని అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్మిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ వార్తతో నాని టీం ఈ సారి ఏదో పెద్ద ప్లానే వేసిందని తెగ చర్చించుకుంటున్నారు. ఇక డిసెంబర్ చివరికల్లా లేదా జనవరి మొదట్లో ఈ మూవీ నుంచి మరో గ్లింప్స్ లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. మరి దీనిపై రాబోయే రోజుల్లో మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఈ మూవీలో కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని`అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999